బీఆర్ఎస్ అభ్యర్థి ప్రవీణ్‌కుమార్ విజయం ఖాయం

బీఆర్ఎస్ యువజన విభాగం జిల్లా నాయకుడు ప్రసాద్

ఆమనగల్లు, మార్చి22: నాగర్‌కర్నూల్ పార్లమెంట్ బీఆర్ఎస్ అభ్యర్థిగా నియమితులైన ఆర్.ఎస్.ప్రవీణ్‌కుమార్ విజయం సాధించటం ఖాయమని బీఆర్ఎస్ యువజన విభాగం జిల్లా నాయకుడు కొమ్ము ప్రసాద్ తెలిపారు. ఆమనగల్లు మండల కేంద్రంలో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో కొమ్ము ప్రసాద్ మాట్లాడుతూ బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఆధ్వర్యంలోని ప్రభుత్వం చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలే బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థులను గెలిపిస్తాయని ఆయన తెలిపారు. కాంగ్రెస్ పార్టీ చెప్పిన దొంగ హామీలను నమ్మి రాష్ట్ర ప్రజలు మోసపోయారన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి ప్రజలు ఓటుతో బుద్ధి చెబుతారని ఆయన పేర్కొన్నారు. ఈ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థులు ఘన విజయం సాధించటం ఖాయమన్నారు.

అంబులెన్స్ తనిఖీ చేసిన అధికారులు

యాచారం, మార్చి 22 : మండలంలో అత్యవసర సమయంలో సేవలు అందించే 108అంబులెన్స్‌ను శుక్రవారం అధికారులు ఆకస్మికంగా తనిఖీ చేశారు. అంబులెన్స్‌కు సంబంధించిన ప్రోగ్రాం మేనేజర్ శ్రీకాంత్, ఈఎంఈ రాజబాబు, ఆడిటర్ ఫయాజ్ అంబులెన్స్‌ను తనిఖీ చేశారు. అంబులెన్స్‌లో ప్రజలకు అత్యవసర సమయంలో ఉపయోగించే పరికరాలు, ప్రథమ చికిత్సకు సంబంధించిన పరికరాలు, రికార్డులను సైతం వారు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అత్యవసర సమయంలో ప్రజలకు అందుబాటులో ఉండి వారికి విలువైన సేవలను అందించేందుకు కృషి చేయాలన్నారు. వాహనంలో ఇంజక్షన్లు, మందులు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండేలా చూసుకోవాలని సూచించారు. సిబ్బంది తమ విధులను సమర్థవంతంగా నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో సిబ్బంది ఉన్నారు.

ఉప్పరిగూడ సహకార సంఘం

ఇన్‌చార్జి చైర్మన్‌గా పాండురంగారెడ్డి

ఇబ్రహీంపట్నం, మార్చి22: ఉప్పరిగూడ సహకార సంఘం ఇన్‌చార్జి చైర్మన్‌గా పాండురంగారెడ్డిని నియమిస్తూ జిల్లా సహకార సంఘం అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. ఉప్పరిగూడ సహకార సంఘం చైర్మన్, వైస్‌చైర్మన్‌లపై డైరెక్టర్లు అవిశ్వాసాన్ని ప్రవేశపెట్టారు. దీంతో సహకార సంఘం చైర్మన్ కోర్టును ఆశ్రయించాడు. అవిశ్వాస బలపరీక్షను నిర్వహించి ఫలితాలను మాత్రం సీల్డ్ కవర్‌లో పంపించాలని కోర్టు ఆదేశించింది. దీంతో కొన్ని రోజులుగా సహకార సంఘం చైర్మన్, వైస్ చైర్మన్‌ల పదవులు ఖాళీగా ఉన్నాయి. దీంతో ఇన్‌చార్జి చైర్మన్‌గా పాండురంగారెడ్డిని నియమిస్తూ డైరెక్టర్లు తీర్మానించారు. డైరెక్టర్ల తీర్మానం ప్రకారం పాండురంగారెడ్డిని ఇన్‌చార్జి చైర్మన్‌గా నియమిస్తూ సహకార సంఘం జిల్లా అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు.

నీటి సంరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత

బాలవికాస ప్రతినిధి రెహమాన్

పర్వేద జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రపంచ జల దినోత్సవం

శంకర్‌పల్లి మండలం పర్వేద గ్రామంలో ర్యాలీ నిర్వహిస్తున్న ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు

చేవెళ్లరూరల్, మార్చి 22 : అన్ని కాలాల్లో నీటిని పొదుపు చేయాలని, నీటిని సంరక్షించే బాధ్యత ప్రతి ఒక్కరిదని బాలవికాస ప్రతినిధి రెహమాన్ అన్నారు. ప్రపంచ జల దినోత్సవాన్ని పురస్కరించుకొని శుక్రవారం శంకర్‌పల్లి మండలం పర్వేద గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల బాలవికాస సాంఘిక సేవా సంస్థ ఆధ్వర్యంలో ప్రపంచ జల దినోత్సవం సందర్భంగా విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా రెహమాన్ మాట్లాడుతూ.. తాగునీటి ప్రాముఖ్యత దాని సంరక్షణపై ప్రతి ఒక్కరికీ అవగాహన పెంచడానికి ప్రపంచ నీటి దినోత్సవం జరుపుకొంటారని, ప్రపంచ నీటి సంక్షోభానికి వ్యతిరేకంగా పోరాడేందుకు చర్యలు తీసుకోవడమే ప్రపంచ జల దినోత్సవ ముఖ్య ఉద్దేశమన్నారు. సుస్థిర అభివృద్ధి లక్ష్యం 2030 నాటికి అందరికీ నీరు, పారిశుధ్యం అనే ఆలోచనకు మద్దతు ఇవ్వడం లక్ష్యాన్ని చేరుకోవడం, సహాయపడటంలో విద్యార్థులు కీలకపాత్ర పోషించాలన్నారు. ఇప్పటికే ప్రపంచవ్యాప్తంగా పలు ప్రాంతాల్లో నీటి కొరతతో ప్రజలు అలమటిస్తున్నారని తెలిపారు. భూమిపై మానవుడు సుభిక్షంగా సురక్షితంగా మనుగడ సాగించాలంటే నీటి పరిరక్షణకు చిన్నప్పటినుంచే బాధ్యత వహించాలని విద్యార్థులకు సూచించారు. అదేవిధంగా నీటి కాలుష్యానికి కారణమయ్యే వాటిని నిషేధించడం, వైవిధ్య రక్షణ వంటి పలు అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు విజయ్ కుమార్, రమణారెడ్డి, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

నీటిని వృథా చేయొద్దు..

చేవెళ్లటౌన్ : నీటిని పొదుపుగా వాడుకోవాలని చేవెళ్ల ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ కాంచన లత అన్నారు. చేవెళ్ల మండల కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ కాంచనలత, ఎన్ఎస్ఎస్‌యూ, ఎన్ఐటీఐ ఆధ్వర్యంలో ప్రపంచ జల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. దేశంలో తీవ్ర వర్షభావ పరిస్థితులు రైతంగానికి నష్టాలను మిగిల్చాయని, సకాలంలో వర్షాలు కురవక పంటలకు నీరందక ఎండిపోతున్నాయని తెలిపారు. బెంగుళూర్ నగరంలో నీరు దొరకక ప్రజల గొంతులు ఎండిపోతున్నాయని, అందుకు ప్రతి ఒక్కరూ నీటిని సంరక్షించాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ జ్యోతి మాట్లాడుతూ.. నీరు శాంతిని సృష్టించగలదని, విప్లవం కలిగించగలదని తెలిపారు. నీటి సంక్షభంతో వరల్డ్ వాటార్ డే ప్రాముఖ్యత సంతరించుకుందని అన్నారు. కఠినమైన నిబంధనలతో నీటి సంరక్షించుకోవచ్చని వివరించారు. కార్యక్రమంలో అధ్యాపకులు రుప్నారవింద్రన్, శకుంతల, వెంకటేశ్వర్లు, రాగిణి, వెంకటలక్ష్మి, వీరేశం, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులు, అధ్యాపకుల ర్యాలీ

పెద్దఅంబర్‌పేట : మున్సిపాలిటీ పరిధి కుంట్లూరు సమీపంలోని పల్లవి ఇంజినీరింగ్ కాలేజీలో శుక్రవారం ప్రపంచ జల దినోత్సవాన్ని నిర్వహించారు. నీటిని పొదుపు చేయండి.. ప్రాణాలను కాపాడుకోండి, శాంతి కోసం నీరు' అంశంపై అవగాహన సదస్సు ఏర్పాటుచేసి, విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఓయూ ప్రొఫెసర్ గోపాల్‌నాయక్ మాట్లాడుతూ.. సహజ వనరుల్లో నీరు అత్యంత ప్రాధాన్యమైనదని చెప్పారు. 'సేవ్ వాటర్, సేవ్ లైఫ్' అంటూ విద్యార్థులు నినాదాలు చేశారు. కార్యక్రమంలో పల్లవి విద్యాసంస్థల చైర్మన్ కొమరయ్య, కాలేజీ ప్రిన్సిపాల్ ఎంబీ రాజు, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ నవీన్‌కుమార్, కన్వీనర్ ఎం ప్రియంవద, అడ్మిని స్ట్రేటివ్ ఆఫీసర్ శ్రీధర్, కాలేజీ ప్రతినిధులు సుమేధ రమేశ్, రాజేందర్‌రెడ్డి, వివిధ విభాగాల అధిపతులు పాల్గొన్నారు.

చేవెళ్లటౌన్: సమావేశంలో మాట్లాడుతున్న కాంచన లత

ర్యాలీలో పాల్గొన్న విద్యార్థులు, అధ్యాపకులు

అనుమతి లేని పాఠశాలలపై చర్యలు

యాచారం, మార్చి 22 : అనుమతులు తీసుకున్న తరువాతనే పాఠశాలలు అడ్మిషన్లు తీసుకోవాలని, లేనిపక్షంలో ఆయా పాఠశాలలను మూసివేసి యాజమాన్యంపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని మండల విద్యాధికారి కె.వెంకట్‌రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అనుమతులు లేని పాఠశాలలను ప్రభుత్వం సీజ్ చేస్తుందని, దీనివల్ల పిల్లల చదువు మధ్యలో ఆగిపోయే ప్రమాదం ఉందని, కాబట్టి, తల్లిదండ్రులు తమ పిల్లలను చేర్పించేటప్పుడు తగిన జాగ్రత్తలు పాటించాలని సూచించారు. మండల కేంద్రంలో నూతనంగా అడ్మిషన్లు తీసుకుంటున్న శ్రీవైతన్య పాఠశాలకు ఎలాంటి ప్రభుత్వ అనుమతులు లేవని మండల విద్యాధికారి పేర్కొన్నారు. విద్యాశాఖ అనుమతులు లేకుండానే విద్యార్థుల నుంచి అడ్మిషన్లు తీసుకోవడం చట్టరీత్యా నేరమని ఆయన పేర్కొన్నారు.

ఫిరోజ్‌ను సన్మానిస్తున్న ఎన్ఎస్‌యూఐ నాయకులు

ఎన్ఎస్‌యూఐ నియోజకవర్గ

జనరల్ సెక్రటరీగా ఫిరోజ్

ఆమనగల్లు, మార్చి 22: కల్వకుర్తి నియోజకవర్గ ఎన్ఎస్‌యూఐ జనరల్ సెక్రటరీగా ఆమనగల్లు మున్సిపాలిటీకి చెందిన ఎండీ ఫిరోజ్‌ను నియమించారు. ఈ మేరకు శుక్రవారం ఎమ్మెల్సీ, ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర అధ్యక్షుడు బల్మూరి వెంకట్ నియామక ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా ఫిరోజ్ మాట్లాడుతూ తన నియామకానికి సహకరించిన పార్టీ పెద్దలకు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం ఫిరోజ్‌ను ఎన్ఎస్‌యూఐ నాయకులు సన్మానించారు.

ఉపాధి పనుల్లో నిర్లక్ష్యం తగదు

మంచాల, మార్చి 22: ఉపాధి హామీ పథకంలో పనికోసం దరఖాస్తు చేసుకున్న ప్రతి ఒక్కరికీ పని కల్పించాలని మంచాల ఎంపీడీవో బాలశంకర్ అన్నారు. శుక్రవారం మంచాల మండలం ఆరుట్ల గ్రామంలో ఉపాధిహామీ పథకం పనులను పరిశీలించిన అనంతరం గ్రామంలో పర్యటించి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ఉన్న పంచాయతీ కార్యదర్శి ప్రజలకు అందుబాటులో ఉండి సమస్యలను పరిష్కరించాలని కోరారు. వేసవి కాలంలో నీటి సమస్య తలెత్తకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. ఉపాధి కోసం దరఖాస్తు చేసుకున్న కూలీలకు పనికల్పించాలన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి వెంకటేశ్ పాల్గొన్నారు.

వైభవంగా బ్రహ్మోత్సవాలు

కడ్తాల్, మార్చి 22: మండల పరిధిలోని రావిచేడ్ గ్రామంలో శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి ఆలయ బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. శుక్రవారం ఉదయం నిత్యపూజ కార్యక్రమం, పారాయణం, అర్చనలు, హోమాలు, అమ్మవార్లకు కుంకుమార్చన చేశారు. అనంతరం దేవతామూర్తుల విగ్రహాలకు పూజలు చేసి పల్లకీసేవలో గ్రామంలో ఊరేగించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ గోపాల్, మాజీ ఉప సర్పంచ్ వెంకటేశ్, ఆలయ అనువంశిక ధర్మకర్త రామచందర్‌రావు, క్రాంతికుమార్, ఆలయ అర్చకులు శ్రీమాన్ తిరుమల వింజమూరి రామానుజాచార్యులు, శ్రీమాన్ ఆచార్య ఆదిత్య, చిదంబరశర్మ, శిరీశ్‌కుమార్, ఆలయ నిర్వాహకులు రంగయ్య, శ్రీనివాస్, యాదయ్య, పవన్, మల్లేశ్, లింగం, రమేశ్, రాజు, రవి, పారేశ, రామచంద్రయ్య, గ్రామ పెద్దలు, భక్తులు పాల్గొన్నారు.

సొసైటీ అభివృద్ధికి కృషి చేస్తాం

కొంగరకలాన్ మహిళా మత్స్య సొసైటీ నూతన కమిటీ అధ్యక్షురాలిగా విజయలక్ష్మి

ఆదిబట్ల, మార్చి 22: ఆదిబట్ల మున్సిపాలిటీ పరిధిలోని కొంగరకలాన్ మహిళా మత్స్య సొసైటీ నూతన కమిటీని శుక్రవారం మత్స్య పారిశ్రామిక ఎన్నికల అధికారిని సరస్వతి ఆధ్వర్యంలో ఎన్నుకున్నారు. కమిటీ అధ్యక్షురాలిగా కొంగరకలాన్ గ్రామానికి చెందిన ముక్కెర విజయలక్ష్మి, ఉపాధ్యక్షురాలిగా గోదాసు పుష్పలత, ప్రధాన కార్యదర్శిగా సంతోష, డైరెక్టర్లుగా అలివేలు, గోదాసు అనిత, గోదాసు ప్రేమలత, నాగలక్ష్మి, సరిత, గోదాసు కల్పనతో పాటు మరో 24 మంది కమిటీ సభ్యులను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రానున్న రోజుల్లో గ్రామంలో మత్స్య సొసైటీ అభివృద్ధికి మహిళలందరూ ఐక్యతతో కలిసి పని చేస్తామన్నారు. కార్యక్రమంలో గ్రామ ముదిరాజ్ సంఘం పెద్దలు నారాయణ, పరమేష, చక్రపాణి, రవీందర్, గోధాసు మధు, మహేందర్, నాగేశ్, ప్రశాంత్, అజయ్ తో పాటు ముదిరాజు సంఘం నాయకులు పాల్గొన్నారు.

సీతారాంపూర్‌లో 'ఉయ్ వలంటీర్' కార్యక్రమం

సీతారాంపూర్‌లో ఉయ్ వలంటీర్ కార్యక్రమంలో పాల్గొన్న వెల్‌స్పన్ ఫౌండేషన్ సభ్యులు

షాబాద్, మార్చి 22: షాబాద్ మండలంలోని సీతారాంపూర్ గ్రామంలో వెల్‌స్పన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాల గోడలకు మ్యూరల్ ఆర్ట్ ద్వారా రంగురంగుల బొమ్మలను చిత్రీకరించారు. శుక్రవారం గ్రామంలో ఉయ్ వలంటీర్ అనే కార్యక్రమంలో భాగంగా 60 మందికి పైగా వెల్‌స్పన్ ఫ్లోరింగ్, అడ్వాన్స్ టెక్స్‌టైల్స్ సిబ్బంది పాల్గొని వివిధ రంగుల చిత్రాలను పాఠశాల గోడలపై గీశారు. కార్యక్రమంలో వెల్‌స్పన్ హెడ్ రీతం, జనరల్ మేనేజర్ సురేఖ, మాజీ సర్పంచ్ కొత్త పాండురంగారెడ్డి, ప్రాజెక్ట్ మేనేజర్ భద్రయ్య, పాఠశాల హెచ్ఎం విజయలక్ష్మి, వెల్‌స్పన్ ఫౌండేషన్ సిబ్బంది సునంద, పూజ, వెంకటేశ్, రుతుజా, పర్మీందర్‌సింగ్, రవి తదితరులు పాల్గొన్నారు.

సేవా కార్యక్రమాల్లో యువత ముందుండాలి

ఇబ్రహీంపట్నంరూరల్, మార్చి 22 : స్వచ్ఛత సేవా కార్యక్రమాల్లో ఆపద, విపత్తు సమయాల్లో ప్రజలను ఆదుకోవటంలో యువత ముందుండాలని డీవైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి ఆనంగంటి వెంకటేష్ పిలుపునిచ్చారు. డీవైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో భగత్‌సింగ్, రాజ్‌గురు, సుక్‌దేవుల వర్ధంతి సందర్భంగా ఇబ్రహీంపట్నంలోని పాషా, నరహరి స్మారక కేంద్రంలో మెగా రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్ దేశ స్వాతంత్ర్యం కోసం తమ ప్రాణాలను అర్పించిన యోధులని కొనియాడారు. నేటి యువతకు భగత్‌సింగ్ జీవితం స్ఫూర్తిదాయకమన్నారు. యువత స్వచ్ఛందంగా సేవా కార్యక్రమాలు నిర్వహించాలని ఆయన పిలుపునిచ్చారు. ముఖ్యంగా డీవైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించటం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి జగన్, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి శంకర్, నాయకులు జంగయ్య, రాఘవేందర్, చరణ్, మహేశ్, శ్రీకాంత్, వంశి, వేణ, వినయ్, యాదగిరి పాల్గొన్నారు.

బొడ్రాయి ఉత్సవాలకు విరాళం

షాబాద్, మార్చి 22: షాబాద్ జడ్పీటీసీ పట్నం అవినాశ్‌రెడ్డిని నగరంలోని ఆయన నివాసంలో శుక్రవారం షాబాద్ మండలంలోని రుద్రారం గ్రామస్తులు కలిసి ఏప్రిల్ 3వ తేదీ నుంచి గ్రామంలో జరిగే బొడ్రాయి, నవగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమాలకు రావాలని ఆహ్వానించారు. అనంతరం బొడ్రాయి ఉత్సవాలకు జడ్పీటీసీ అవినాశ్‌రెడ్డి తన వంతు సాయంగా రూ.లక్ష విరాళం అందజేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు గుర్రాల విష్ణువర్ధన్‌రెడ్డి, నర్సింహులు, సతీశ్, కృష్ణ తదితరులున్నారు.

నీటి వనరులను పరిరక్షించాలి

సిటీబ్యూరో, మార్చి 22 (నమస్తే తెలంగాణ) : నగరంలోని నీటి వనరులు ఆక్రమణలకు గురికాకుండా పరిరక్షించడానికి కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలని జీహెచ్ఎంసీ కమిషనర్ రొనాల్డ్ రాస్ సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం బుద్ధ భవన్‌లోని ఈవీడీఎం కార్యాలయం సమావేశ మందిరంలో సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ జీహెచ్ఎంసీ పరిధిలోని అన్ని చెరువుల వద్ద ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్ సరిహద్దులకు సంబంధించిన మ్యాప్‌లను చెరువుల వద్ద ప్రదర్శించాలని సూచించారు. లేక్ ప్రొటెక్షన్ కమిటీలను ఏర్పాటు చేయాలని, ఈ కమిటీ సభ్యులచే వాట్సాప్ గ్రూపులను చైతన్య పర్చాలని, మొబైల్ యాప్ ఇవ్వాలని, ఇందులో పర్యవేక్షణ నివేదిక పెట్టాలన్నారు. ఫెన్సింగ్, వాకింగ్ ట్రాక్, సివరేజీ మళ్లింపు, సీసీ కెమెరాలు, వీధి దీపాలు, సెక్యూరిటీ గార్డుల ఏర్పాటుకు అంచనా ప్రతిపాదనలు 15 రోజుల్లో ఇవ్వాలని లేక్స్ అధికారులను ఆదేశించారు. నిర్మాణ వ్యర్థాలను చెరువుల్లో డంప్ చేస్తున్న వారిని గుర్తించి ఈవీడీఎం డైరెక్టర్‌కు సమాచారం ఇవ్వాలని, ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని లేక్స్ అధికారులను ఆదేశించారు. చెరువు బఫర్ జోన్‌లో నిర్మించే భవనాలకు ఉన్న పక్షంలో నోటీసులు జారీ చేయాలన్నారు. సమావేవంలో ఈవీడీఎం డైరెక్టర్ ప్రకాశ్‌రెడ్డి, అడిషనల్ కమిషనర్లు శివకుమార్ నాయుడు, సునంద, జోనల్ కమిషనర్లు హేమంత్, స్నేహ శబరీష్, అభిలాష అభినవ్, రవి కిరణ్, వెంకన్న, ముకుందా రెడ్డి, ప్రాజెక్టు, లేక్స్ సీఈ దేవానంద్, ఎస్ఈ ఆనంద్, ఈఈ, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు

కందుకూరు, మార్చి 22 : రోడ్డు ప్రమాదాలు జరుగకుండా చర్యలు తీసుకుంటున్నట్లు రోడ్డు సెఫ్టీ ఇన్‌స్పెక్టర్ కీసర నాగరాజు, ఎన్‌హెచ్ఏఐ సైట్ ఇంజినీర్ హర్షిణి తెలిపారు. శుక్రవారం హైదరాబద్-శ్రీశైలం జాతీయ రహదారిపై జరుగుతున్న ప్రమాదాల నివారణలో భాగంగా పోలీసులతో పాటు ఎన్‌హెచ్ఏఐ అధికారులు కందుకూరు పోలీస్‌స్టేషన్ పరిధిలోని పలు ప్రాంతాలను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. కందుకూరు క్రాస్ రోడ్డు, హైటెక్ దాబా, కొత్తగూడ, నేదునూరు, దెబ్బడగూడ క్రాస్‌రోడ్డులో ప్రమాదాలు జరుగుతున్నట్లు గుర్తించామని తెలిపారు. ప్రమాదాలు జరుగకుండా జాగ్రత్తలను తీసుకుంటున్నట్లు వివరించారు. కార్యక్రమంలో సీఐ మక్బూల్ జానీ, ఇంజినీర్ శ్రీనివాస్‌లు పాల్గొన్నారు.

శ్రీశైలం-హైదరాబాద్ జాతీయ రహదారిపై ప్రమాదాల స్థలాలను పరిశీలిస్తున్న పోలీసులు, ఎన్‌హెచ్ఏఐ అధికారులు

వధువుకు ఆర్థిక సాయం

ఆమనగల్లు, మార్చి 22: మండలంలోని శెట్టిపల్లి గ్రామానికి చెందిన కొమ్ము యాదమ్మ -విష్ణయ్య దంపతుల ఏకైక పుత్రిక వివాహం శుక్రవారం జరిగింది. గ్రామ మాజీ సర్పంచ్ ఎగిరిశెట్టి గోదాదేవి వివాహానికై హాజరై తులం బంగారం అందజేసింది.

బాధిత కుటుంబానికి పరామర్శ

శెట్టిపల్లి గ్రామానికి చెందిన జెల్ల బుడ్డయ్య మరణించగా, విషయం తెలుసుకున్న గోదాదేవి బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. అనంతరం బాధిత కుటుంబానికి రూ. 5వేల ఆర్థిక సాయం అందజేశారు. ఆమె వెంట కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకుడు ఎగిరిశెట్టి సత్యం, నాయకులు వీరయ్య, అర్జున్‌రావు, నర్సింహ, మహేశ్, పెద్దయ్య, మల్లయ్య, యాదయ్య ఉన్నారు.

దేశాభివృద్ధికి యువత కృషి చేయాలి

హైదరాబాద్ కేంద్ర విశ్వవిద్యాలయ ప్రోగ్రాం కో ఆర్డినేటర్ ప్రొఫెసర్ సుధాకర్ బాబు

చేవెళ్ల రూరల్, మార్చి 22 : దేశ భవిష్యత్ యువత చేతుల్లోనే ఉందని, సవాళ్లు అధిగమించి దేశాభివృద్ధికి సంపద సృష్టించి సక్రమంగా వినియోగించడంలో కీలక పాత్ర పోషించాలని హైదరాబాద్ కేంద్ర విశ్వవిద్యాలయం (సెంట్రల్ యూనివర్సిటీ) ప్రోగ్రాం కోఆర్డినేటర్ ప్రొఫెసర్ సుధాకర్ బాబు అన్నారు. శుక్రవారం శంకర్‌పల్లి మండల కేంద్రంలోని జాగృతి డిగ్రీ కళాశాలలో రాజీవ్ గాంధీ జాతీయ యువజన అభివృద్ధి సంస్థ, మానవ వనరుల అభివృద్ధి సంస్థ హైదరాబాద్ కేంద్ర విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో యువత అభివృద్ధిలో సామాజిక న్యాయం, జాతి నిర్మాణంలో యువత పాత్ర, సామాజిక సమస్యలు - యువత భాగస్వామ్యం అనే అంశాలపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ప్రొఫెసర్ సుధాకర్ బాబు హాజరై మాట్లాడుతూ.. యువత సెల్‌ఫోన్లను భవిష్యత్ జ్ఞానం కోసం ఉపయోగించాలని, నేటి పోటీ ప్రపంచంలో ఇష్టపడి చదువుతూ దేశంలోనే ప్రతిష్టాత్మకమైన జవహర్‌లాల్ నెహ్రూ యూనివర్సిటీ, హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ, ఉస్మానియా విశ్వవిద్యాలయంలో చదువుకోవడానికి ముందుకు రావాలన్నారు. ప్రతిరోజూ దినపత్రికలు, లైబ్రరీలను విరివిగా ఉపయోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో వెంకయ్య గౌడ్, జాగృతి డిగ్రీ కళాశాల చైర్మన్ జీఎస్.రాజు, కళాశాల ప్రిన్సిపాల్ సి.కృష్ణారెడ్డి, ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ రామస్వామి అనంతరెడ్డి, హైదరాబాద్ కేంద్ర విశ్వవిద్యాలయ ప్రొఫెసర్లు అజంతా (అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం) ప్రొఫెసర్ బి.ఈశ్వర్, అశోక్, ఎం.నాగరాజు, జాగృతి కళాశాల వైస్ ప్రిన్సిపాళ్లు శ్రీనివాస్, దీపిక, సామాజిక కార్యకర్త, తెలంగాణ రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత పాపగారి ఆశీర్వాదం తదితరులు పాల్గొన్నారు.